# సుప్త భుజంగం

"ఈభూ(వి నాది" అన్నాడు లింగాలు.

ఆరేళ్ళనించీ అలా అంటూనేవున్నాడు.

అలా అనమని లింగాలుకు ఎవరూ మప్పలేదు. మప్పినా అంత ధైర్యంగా లింగాలు అంటాడనికూడా ఆ వూళ్ళో వాళ్ళెవళ్ళకీ నమ్మకంలేదు.

అయినా

ఎవళ్ళూ మప్పకుండానే, దగాపడిన గుండెధైర్యంతో అన్నాడు లింగాలు.

"ఈ భూ(వి నాదీ" అని.

ఆ భూమి ఎలా తనదీ?

• ఆ వివరాలూ, మతలబులూ అతనెరగడు.

ఆ భూమిని తన తాత సాగుచేసేడుట. తన తండ్రి సాగుచేయటం తనెరుగును. ఇప్పుడు తనూ సాగుచేస్తున్నాడు, పండిస్తున్నాడు. కనుక, ఆ భూమి తనదని లింగాలు నమ్మకం. అలా అని "దున్నేవాడిదే భూమి" అనే సిద్ధాంతాన్ని ఆధారం చేసుకుని అంటున్నాడని అనుకోమాకండి. అసలు ఆ నినాదమే విన్లేదు లింగాలు. విన్నా, దాని అర్థం ఏవిటో తెలీని అజ్ఞాని లింగాలు.

అయితే, అంత ధైర్యంగా, అలా కామందు ముందు అనటానికి ప్రేరణ ఏమిటి?

జీవితం.

జీవించటానికి అవసరం అయిన పోరాటం.

జంతువు పుట్టగానే పాలకోసం తల్లి రొమ్ము ఎందుకు కుమ్ముతుంది? అక్కడ పాలున్నాయని దానికెలా తెల్సింది?

అవసరం.

అవసరం అన్వేషణకి మాతృక.

ఇక్కడ లింగాలుకు అవసరం ఒక్కటే ప్రేరణకాదు. ఆ భూమితో అతనికి వున్న అనుబంధం.

ఆ భూమిలో వున్నది మట్టికాదు.

తన కండల పిండి.

ఆ మట్టిలో వున్నది తేమకాదు.

తన చెమట.

తన కండల కష్టంతో నిండి, తన చెమటతో తడిసిన ఆ నేల తనదికాదుట!

"ఇక నువ్వు పొలంలోకి అడుగు పెట్టడానికి వీలులేదు" అన్నాడు వెంకయ్యనాయుడు.

పిడుగు పడినంత పనైంది లింగాలుకు.

ఆ భూమి తనది కాదని ఎరగడు లింగాలు. ఆ భూమి ఎలా తనదో ఎరగడు లింగాలు, ఎలా తనది కాదోకూడా ఎరగడు.

తనకు ఊహ తెల్సిననాటినుంచీ తనదిగానే చలామణీ అవుతోన్న ఆ భూమిలో, తననే అడుగు పెట్టవద్దంటే.

తన తలతో ఆలోచించవద్దన్నట్టుంది.

తన చేతుల్తో పనిచేయవద్దన్నట్టుంది.

అందుకే-

ఆ భూమి తనదని తెగేసి చెప్పేసేడు లింగాలు.

"ఏరా....ఒళ్ళు కొవ్వెక్కిందా?" అని పడక్కుర్చీలోంచిలేచి పక్కనున్న జువ్వకర్ర అందుకున్నాడు నాయుడు.

"నువు కొట్టు, చంపు-ఏమయినా చెయ్యి. ఆ బూవిలోంచి మాత్తరం నాను కదల్ను. ఆ బూవి నాది" అన్నాడు లింగాలు.

చేతిలోకి కర్ర అయితే అందుకున్నాడు. కొట్టేధైర్యాన్ని మాత్రం అందుకోలేకపోయేడు నాయుడు.

ముప్పయ్యేళ్ళుగా నాయుడికి తెల్సు లింగాలు.

ముప్పయ్యేళ్ళనించీ-గుడిలోలింగంలా గుదికట్టిన గొడ్డెలా పడి వున్నాడేగాని, మనిషిలా ఇలా ఎన్నడూ మాట్లాడి ఎరగడు లింగాలు.

మనిషి మనిషిగా కన్పిస్తే భయం నాయుడికి.

అందుకే-

తన చేతికింద బతికే వాళ్ళనెవళ్ళనీ మనుషులుగా మారనివ్వడు నాయుడు. వాళ్ళని జంతువులుగానే ఉంచుతాడు.

కట్టు దూడలా తన కాళ్ళముందు ముప్పయ్యేళ్ళుబతికేడు లింగాలు. అందుకే అలవాటుగా కర్రపుచ్చుకు లేచేడు నాయుడు.

తీరా లేచేక కట్టు దూడలా కన్పించలేదు లింగాలు.

కట్టు తెంచుకుని బుస కొడుతోన్న పోట్లగిత్తలా కన్పించేడు. అందుకే ఆగేడు. ఆగి ఆలోచించేడు.

లింగాలు యవ్వనంలో వున్నాడు. అంతేకాదు. బలంగాకూడా వున్నాడు.

నాయుడు వృద్ధుడు కాదుగాని, యువకుడు మాత్రం కాదు.

బలమైన వాడి మీదికి బడితె ఎత్తితే, తిరిగి అదే తనమీద పడ్తుందని తెలీనివాడు కాదు నాయుడు.

కాలానుగుణమైన కర్రకు కాలం లొంగనప్పుడు బుద్ధినే ఉపయోగించబోయేడు.

"కదలక ఏం చేస్తావేం?" అన్నాడు నాయుడు.

"ఏం సేత్తాన్ను? సాగుసేత్తాను. పండిత్తాను."

"సరే కానీ అదీ చూద్దాం" అన్నాడు నాయుడు.

అలా అని ఆరేళ్ళయింది.

ఎప్పట్లానే నాయుడి దగ్గర పన్జేస్తున్నాడు లింగాలు.

తనదనుకుంటోన్న పొలాన్ని ఎప్పట్లా పండిస్తూనే వున్నాడు లింగాలు. ఆ పంట కోసి బళ్ళకెక్కిస్తూనే వున్నాడు నాయుడు.

అది అన్యాయం అని ఒక్కరూ అనలేదు.

అది అక్రమం అని ఒక్కరూ నిరసించలేదు.

ఆ పని లింగాలూ చేయలేదు.

అలా జరక్కుండా జాగ్రత్తపడ్డాడు నాయుడు.

లింగాలు ఆత్మీయులుగా భావించిన వాళ్ళు, లింగాలు స్వజనంగా నమ్మిన వాళ్ళు - అంతా ఆ నాయుడి కొమ్మేకాసేరు.

"ఆ బావు సొమ్ము ఆ బావు తీసేసుకుంటానంటే, నువ్వావిడివి మద్దిలో ఒద్దంటానికి?" అని లింగాలుకే బుద్ధి చెప్పచూసేరు.

వాళ్ళకు తెలీదా ఆ భూమి చరిత్ర?

వాళ్ళకు తెలీదా ఎన్ని తరాలుగా ఆ భూమి తన కుటుంబం ఆధీనంలో ఉందో?

వాళ్ళకు తెలీదా, ఎన్నాళ్ళు నాయుడి కుటుంబం ఆ భూవినే అడ్డంపెట్టుకుని తన కుటుంబాన్ని కట్టుబానిసలుగా కట్టిపారేసిందో

తెల్సు.

"మనం ఉంటున్న పేట, పేటంతా ఆ బావుదేమరి. రేపు అందర్నీ అక్కడినించి యెలిపొమ్మంటాడు, ఎల్లిపోతారా? ఎక్కడి కెల్లిపోతారు?" ప్రశ్నించేడు లింగాలు.

అవును వెళ్ళిపొమ్మంటే?

అందుకే నాయుడు కొమ్ము కాసేరు వాళ్ళంతా.

"సరే, నా ఒక్కడికోసం మీరంతా దిక్కులేకుండా పోటమెందుకు? నేనే ఒంటిగా పోరాడతా" అన్నాడు లింగాలు.

ఆరేళ్ళనించీ ఆ పోరాటం ఏ రూపంలో సాగిందో వాళ్ళకీ తెలిసివచ్చింది.

ఆరేళ్ళనించీ వాళ్ళంతా ఎలా ప్రేక్షకులుగా మిగిలిపోయారో అందరికీ తెలియ వచ్చింది.

అంతకు ముందు ఒట్టి కౌలు మాత్రమే గిట్టుబాటయ్యేది నాయుడికి.

ఇప్పుడు పండిన పంటంతా ముడుతోంది.

అంచేత నాయుడి ఇంట్లో వాళ్ళకీ తెలియవచ్చింది ఈ నిలువు దోపిడి నిజ స్వరూపం.

"ఇలా ఎంతకాలం నీకష్టాన్ని ధారపోస్తావు లింగాలూ, పోనీ పండించటమే మానేయరాదూ" అంటుంది నాయుడి కూతురు సీత.

సీత లింగాలు దృష్టిలో అచ్చం సీతమ్మతల్లే.

సీతకు రాముడైతే రాలేదుగానీ, రాకుండానే ఆమెను గొప్ప పతివ్రతగా, ధర్మదేవతగా దర్శిస్తున్నాడు లింగాలు.

"పండించకపోతే ఎలాగమ్మా?"

"నువు పండించుకున్న పంటని దక్కించుకోలేనప్పుడు ఆ శ్రమంతా వృధా కాదా?"

"నిజవే తల్లీ. సిన్నప్పట్నించీ నిన్ను ఈ సేతులమీద ఎత్తుకుని పెంచానుగామట్టి నీకలాగ అనిపిత్తంది. నిన్నో మాటడుగుతా సెప్తావా తల్లీ"

"ఆఁ...... అడుగు"

"ఈఒల్లు నాది. నేనుపుట్టి యెన్నాళ్ళు నా యింట్లో సొంత బతుకు బతికానో

నాకు తెలవదుగాని, తెల్సిన్నాటినించీ ముప్పొద్దులా మీసేవే సేత్తంది ఈ సెరీరం. అలాగని నాసేత్తో ముద్దే తినొద్దంటావా?''

చదువుకోని లింగాలు బుద్ధికి ఇంత తర్కం ఎలా అలవడిందో చదువుకున్న సీతకి అంతుపట్టలా.

లింగాలు అడిగిన ప్రశ్నకు ఆమె దగ్గర జవాబు లేదు.

"పోనీ మీ వాళ్ళు ఇంతమంది వున్నారుకదా, ఒక్కరూ నీకుసాయంగా వచ్చి నాన్న చేసే అక్రమాల్ని ఎదిరించలేరా?'' అని మాత్రం అడిగింది.

"ఆమాట ఆల్లనే అడగాలమ్మా. నన్నడిగితే నేనేం జెప్పను. పోనీ నిన్నే ఉంకో మాటడుగుతా సెప్తావా?''

"అడుగు''

"మీ నాన్నే గందా, ఇది అన్నేయం. లింగాలుగాడి కష్టం అలా దోసుకోవద్దు అని అడిగి మానిపించలేవా?''

"నేను చెబితే మాత్రం ఆయన వింటార్రా?''

"నామాటా అంతేనమ్మా. నీ తండ్రే నీమాట యిన్నప్పుడు పరాయోల్లు ఆల్లు నా మాటింటారా. ఆల్ల మనసులకే తట్టాలిగాని, బతిమాలి బామాలి సేయించుకోగలమా సెప్పండి.''

-అవును, అది నిజమే. కారుణ్యా మనేది కొని తెచ్చుకునేదీ కాదు, అడిగి పుచ్చుకునేదీ కాదు.

-తిరుగుబాటు అనేది ఉపన్యాసాలకీ సిద్ధాంత చర్చలకీ ఒచ్చి పడేదికాదు. ఒచ్చినా ఎక్కువకాలం ఉండేదీ కాదు.

-దేనికైనా పరిస్థితులు పరిపక్వం కావాలి. ఆ పరిపక్వం తాలూకు ప్రభావం మనసులకి హత్తుకుని మానసికంగా ప్రజలు సిద్ధం కావాలి.

అనుకుంది సీత.

అలా చాలా కాలంగా అనుకుంటూనే ఒక రోజున ఇంటికివచ్చిన కూలీతో అంది

"ఇది విన్నావురా రాముడూ'' అని

రాముడు పేటలో మనిషి.

రాముడు పేట పెద్ద మనిషి.

"ఏంటమ్మగారూ'' అనడిగేడు.

"మీరు వుంటున్న ఇళ్ళ స్థలాలు మీవి కావటగా!''

"అవునంటమ్మా. . . .యిన్నాను."

"ఆ భూమిని అమ్మేయాలనుకుంటున్నారు నాన్న. ఇక మీరు అక్కణ్నించి లేచిపోక తప్పదు."

అతని ముఖం మారిపోవటం సీతమ్మ తల్లి చూడనే చూసింది.

ఇక చూడాల్సింది, అడివిమంటలా పేట పేటంతా అల్లుకుపోయిన ఈ వార్త తాలూకు ప్రభావం.

అదీ చూసింది సీత.

ఒక రోజున తెల్లవారకముందే పరుగెత్తుకొచ్చేడు మొద్దోడు.

నాన్నవెంట కుక్కలా తిరిగే మొద్దోడు ఆ చలి ఉదయం చెమటలోడ్చుకుంటూ పరుగెత్తుకొచ్చేడు.

పరుగెత్తుకొచ్చి-

"నాయుడు బాబూ కొంపలంటుకు పోయాయి" అని మనవి చేసుకున్నాడు.

ఏ కొంపలు, ఎలా అంటుకున్నాయని అడగలేదు నాయుడు. సర్వం ఎరిగిన వాడిలా-

"ఎంతవరకూ ఒచ్చింది వ్యవహారం" అని మాత్రం అడిగేడు.

"ఎంతవరకూ ఏంటి బాబూ, మొత్తం పేట పేటంతా ఒచ్చి పంటంతా కోసి పట్టుకు పోయారు."

కుర్చీలో కూర్చున్న నాయుడు లేచి ఒక్క తన్ను తన్నేడు. మొద్దోణ్ని కుక్కను తన్నినట్టు తన్నేడు. తన్నే అరుగుమీంచి దొర్లి మొద్దులా ముద్దలా కిందపడిపోయేడు మొద్దోడు.

•

నాయుడు తన్నింది మొద్దోణ్ని కాదు, వాడి వర్గాన్ని.

నాయుడి కోపం మొద్దోడి మీదిదికాదు. పేట మీదిది.

అలాంటి కబురు మోసుకొచ్చినందుకు కాదు నాయుడి కోపం.

ఆలస్యంగా మోసుకొచ్చినందుకు.

తన్నింది ఎందుకైనా మొద్దోడు తిరిగి తన్నడనే తన్నేడు నాయుడు.

కానీ, మొద్దోడప్పుడు మొద్దోడుకాదు.

తన్నుతో వాడి తలలోని మత్తు జారిపోయింది. తరతరాల ఆ జాతి జడత్వం వాడిలో రక్తమాంసాలుగా పేరుకున్న జడత్వం, జ్వలించి చైతన్యంగా రూపుదిద్దుకుంది.

అహం కోడెతాచులా లేచి ఆడింది.

తన్ని లోపలికెళుతోన్న నాయుణ్ని

పడిలేచిన మొద్దోడు పరుగెత్తి మెడపట్టుకున్నాడు.

పట్టుకుని, గుండెల్లో ఒక్క పోటే మోకాలితో పొడిచేడు.

మొదలు నరికిన చెట్టులా కూలబడిపోయేడు నాయుడు. పడిన నాయుడ్ని ఒక తన్ను తన్నేడు మొద్దోడు.

మెట్లమీంచి కట్టెలా దొర్లిపోయేడు నాయుడు.

దొర్లి దొర్లి నేలమీద ఆగిన నాయుడి శరీరం మీదనించి దాటి, పేటవైపు పరుగెత్తి పోయేడు మొద్దోడు.

ఇదంతా చూస్తూనే వుంది సీతమ్మ తల్లి.

*(జ్యోతి మాసపత్రిక, అక్టోబర్ 1984)*